ప్రేమికుడి పథములో విధుర ప్రణయాలు.

# "విశ్వనాథుడి చాంచల్యం"

(కథానిక)

"హితశ్రీ"

రేడియోలో శ్రావ్యమైన సంగీతం వినిపిస్తోంది.

విశ్వనాథం రేడియో సెట్‌కి దగ్గిరగా కుర్చీ వేసుకుని అమితశ్రద్ధతో ఆ గానం వింటూ తల ఊపుతున్నాడు. అతని చేతిలో రేడియో ప్రోగ్రాముల పత్రిక ఉంది. అతను అప్పుడప్పుడు దీర్ఘంగా నిట్టూరుస్తూ దీనంగా ఆ పత్రికలోని ఓ బొమ్మవైపు చూస్తున్నాడు. అప్రయత్నంగా అతని నోటివెంట "ఓహో", "అద్భుతం", "హాయి, హాయి" అనే మాటలు వెలువడుతున్నాయి. పాట గొప్పగా ఉన్నదని అతనికి తోచినప్పుడు ఆపాటని అనుకరిస్తూ ఆదోరకంగా బొమ్మవైపు చూస్తున్నాడు.

"ఆలిండియా రేడియో. ఇంతవరకూ శ్రీమతి చంచలాకుమారిగారి గానం విన్నారు."

విశ్వనాథం గడియారాన్ని తిట్టుకుని ఒక నిట్టూర్పు విడిచి నిరాశగా శూన్యంలోకి చూడసాగాడు. అతని ముఖంలో ఆవేదన ప్రస్ఫుటమౌతోంది. రేడియో సెట్టులో ఉరుములశబ్దాల కతను మళ్ళీ ఈ ప్రపంచంలోకి వొచ్చి చేతిలో ఉన్న ప్రోగ్రాముల పత్రికలోని బొమ్మవైపు మరోసారి జాలిగా చూశాడు. రేడియోలో మళ్ళీ ఎవరో పాడుతున్నారు. చంచల పాట పంపిన స్వర్గలోకంలో విహరిస్తున్న విశ్వనాథం, "వీళ్ళిలా గొంతు చించుకోవట మెందుకో." అని ఆశ్చర్యపడ్డాడు.

ప్రసిద్ధ గాయకి చంచల విశ్వనాథాన్ని పూర్తిగా సమ్మోహితుణ్ణి చేసింది. ఆమె పాట విన్న మొదటిసారే విశ్వనాథం తన హృదయం ఆమె అధీనమయిందని గ్రహించాడు. ఆమెని అభినందిస్తూ రేడియోవాళ్ళకి, రేడియో సంస్థ ద్వారా ఆమెకి ఉత్తరాలు రాశాడు. తిరుగు టపాలో విశ్వనాథానికి కృతజ్ఞత తెలియబరుస్తూ చంచల ఉత్తరం రాసింది. ఆ విధంగా అవకాశం సంపాదించుకుని ఆమెకి విశ్వనాథం చాలా ఉత్తరాలు రాశాడు. చంచల కూడా రెండు, మూడు ఉత్తరాలు విశ్వనాథానికి రాసింది. తర్వాత విశ్వనాథం ఆమెకి ఓ సుదీర్ఘమైన ఉత్తరం రాస్తూ ఆమెని తను ప్రాణాధికంగా, ఈ లోకంలో ఎవరూ, ఎవర్నీ ప్రేమించనంత గొప్పగా ప్రేమిస్తున్నాననీ, ఆమె ప్రేమ భిక్షకోసం పడిగాపులు కాస్తున్నాననీ ఏమేమో రాశాడు. ఆమె దగ్గిరనుంచి ఏమీ సమాధానం రాలేదు. అందలేదేమోనని సమాధాన పర్చుకుని అతను అలాంటి ఉత్తరమే మరోటి రాసి రిజిష్టరుచేసి పంపాడు. ఆమె దగ్గిరనించి రసీదు వచ్చింది కాని ప్రత్యుత్తరం రాలేదు. తర్వాత విశ్వనాథం వారానికి ఒకటి చొప్పున ఆమెకి తన ప్రేమ తెలియచేస్తూ ఉత్తరాలు రాశాడు. ఒక్కదానికీ ఆమె జవాబివ్వలేదు. ప్రాణం విసిగి ఇహ ఆ ప్రయత్నం విరమించుకోటమే శరణ్యమనే అభిప్రాయంలోకి వొచ్చాడు విశ్వనాథం.

విశ్వనాథం చంచల ప్రేమకోసం ప్రయత్నించటం వృథా అని నిరాశచేసుకుని ఆమెని మర్చిపోవటానికి ప్రయత్నించేసమయంలో ఆమె పాట మళ్ళీ అతన్ని పిచ్చివాణ్నిగా చేసింది. ఆలోచించి ఆఖరిసారిగా ఆమెకో ఉత్తరం రాశాడు.

"—మీరు నన్ను అపార్థం చేసుకున్నట్టున్నారు. నా ప్రేమని మీరింత చులకనగా భావించటం నేను సహించలేను. నా ప్రేమని నేనే పరీక్షించ దలుచుకున్నాను. వొచ్చే శుక్రవారంనించి నేను ఆమరణ నిరాహారదీక్ష వహిస్తున్నాను. ఇది బెదరింపు కాదు. చేతకాని

తనం అంతకంటే కాదు. నా దృఢనిశ్చయం తిరుగులేనిది. "నిరాహార దీక్షవల్ల ఓ యువకుని మరణం" అని మీరు పేపర్లో చదివితే మీరు రాల్చగల ఒకటి, రెండు అశ్రుకణాల సాను భూతి పొందటంకోసమే మీకు నా నిశ్చయాన్ని తెలియపర్చడం జరుగుతుంది..."

ఈ ఉత్తరం అమోఘంగా పని చేసింది. తిరుగుటపాలో చంచల దగ్గరినించి విశ్వనాథా నికి ఓ ఉత్తరం వొచ్చింది. కవరుమీది అడ్రసు దస్తూరీ చూసి మహోత్సాహానికి మనసులో దణ్ణం పెట్టుకుని అతను కవరు విప్పి ఉత్తరం చదివాడు-

"శ్రీ విశ్వనాథం గారికి:

మీ ఉత్తరం నాకు చాలా బాధకలిగించింది. ఇంత మొరటుగా రాయగలగటం నాకు ఆశ్చర్యం కలిగించింది. మీ తప్పు తెలిసికొని పిచ్చి ఊహాలు మాని సరైన మార్గంలోకి వొస్తారని ఆశిస్తాను. చంచల."

ఉత్తరం చదివి కొంతవరకు కృతకృత్యుడి నైనానని భావించుకున్నాడు విశ్వనాథం. వెంటనే ఆమెకి జవాబు రాశాడు. తనని ఆమె వేరే విధంగా అర్థం చేసుకున్నందుకు చింతిస్తు న్నాడనన్నీ, నిరాహార దీక్షవహించటానికి తను నిశ్చయించటంలో అసంబద్ధం ఏమీ లేదనీ, తనని ఆమె క్షమించవలసిందనీ ప్రార్థనాపూర్వకంగా రాశాడు. అతని ఉత్తరానికి జవాబు వెంటనే వొచ్చింది.

"శ్రీ విశ్వనాథంగారికి,

శుక్రవారం మీ వూరు వొస్తున్నాను. హోటెల్ క్రెసెంట్‌లో సాయంత్రం నాలుగు గంటలకి నన్ను మీరు కలుకోవచ్చు.

చంచల."

* * *

శుక్రవారం వచ్చింది. విశ్వనాథం నిరశన వ్రతం ప్రారంభించాడు. ఆరోజు తనని అలంక రించుకోటంతో మధ్యాహ్నం రెండుగంటల దాకా గడిపేశాడు తేలికగా. చిత్తం పరా యత్తం కావటంచేత ఆకలిబాధ అంతగా అతన్ని శ్రమపెట్టలేదు. సరిగా మూడు గంట లయేసరికి విశ్వనాథం బాగా ముస్తాబై విశ్రాంతి తీసుకోటం కోసం పడకకుర్చీలో నడుంవాల్చి చంచల రాసిన ఉత్తరం మళ్ళీ ఓసారి చదువుకో

సాగాడు. ఇంతలో తలుపు దగ్గరేదో చప్పుడైంది. కాసేపటికి తర్వాత ఎవరో గదిలోకి వొచ్చి ఓ హోల్డాలు పడేశాడు. విశ్వనాథం విసుగ్గా చూ శాడు ఆహోల్డాలువైపు. ఎవరో చుట్టం వొచ్చి ఉంటాడని అతను ఊహించుకుని మనసులో ఆ చుట్టాన్ని శపించుకున్నాడు. విసుగుతో ద్వారం వైపు తీక్ష్ణంగా చూస్తున్న విశ్వనాథం వొచ్చిన వ్యక్తిని చూసి కళ్లు పెద్దవి చేశాడు. ఆవొచ్చింది ఒక స్త్రీ. ఆమె విశ్వనాథాన్ని చూసి కాస్త బిడియపడుతూ అంది: "శాంత ఇంట్లో ఉందాండి?"

శాంత ఎవరు? విశ్వనాథానికి అమితఆశ్చ ర్యం వేసింది.

"శాంత?"

"అవును. ఇంట్లో ఉందాండి?"

"శాంత...శాంత ఎవరు?" అన్నాడు విశ్వ నాథం తడబడుతూ. ఆ యువతి విశ్వనాథం వైపు ఆశ్చర్యంగా చూసి, "ఇది శాంత ఇల్లు కాదా?" అంది.

"కాదండి. ఈ ఇంట్లో శాంత అనే ఆమె ఎవరూ లేరు."

"ఇది చిన్నబోయినవారి ఇల్లు కాదూ?" ఆ స్త్రీ సంకోచిస్తూ అడిగింది.

"ఊహుఁ. మీరు పొరపడినట్టున్నారు."

ఆ స్త్రీ ఏదో ఆలోచించి ఏదో గ్రహించిన దానల్లే అంది—

"ఈ చుట్టుపక్కల చిన్నబోయిన విశ్వనాథం గారని ఎవరైనా ఉన్నారేమో మీకు తెలుసా?"

విశ్వనాథం ఆలోచించి అన్నాడు. "నాకు బాగా తెలియదండి. బహుశా ఎవరన్నా ఉంటే ఉండవచ్చు"

ఆ స్త్రీ కొద్దిగా నవ్వి అంది:

"బోర్డుమీద వి. విశ్వనాథం అని ఉంటే పొరబడ్డాను. ఈ ప్రాంతం నాకు కొత్త..."

"అలాగా?"

"శాంత అనే ఆమె నా స్నేహితురాలు. చూసిపోదామని వొచ్చాను. అడ్రసు సరిగా తెలియకపోవటంతో ఇలా..."

"నుంచునే ఉన్నారు. అలా కూర్చోండి" సంకోచిస్తూ అన్నాడు విశ్వనాథం. తీరా ఆమె కూర్చుంటే బయటికి వెళ్ళటానికి ఆలస్యమైపో

తుందని లోలోపల భయపడ్డాడు అతను. ఆమె "పరవాలేదు లెండి" అంటూనే కుర్చీ కొంచెం దూరంగా లాక్కుని వొదిగి కూర్చుంది. విశ్వనాథం గుండె గుబుక్కుమంది.

"మీకు అనవసరంగా ఇబ్బంది కలిగిస్తున్నాను క్షమించాలి."

"అబ్బెబ్బె... ఇబ్బందేముంది?" అన్నాడు విశ్వనాథం పైకి.

"ఈ చుట్టుపక్కల బండీ ఏదీ లేదు. జట్కా వాణ్ణి కాస్సేపు ఉండమన్నా బావుండేది..."

విశ్వనాథం ఈ మాటలు విని గభాలున అన్నాడు- "దాందేముంది లెండి. నేను వెళ్ళి ఓ బండీ పిలుచుకు వొస్తాను."

"ఎంతమాట. మీకంత శ్రమ ఇవ్వలేను. కానీ ఇలా కూర్చుంటే ఏదో బండీ రాకపోదు, ఇదేమైనా మారుమూల వీధి గనకనా? ఇంచుమించు మెయిన్‌రోడ్డాయె" విశ్వనాథం కాస్త గట్టిగానే ప్రయత్నించాడు గాని ఆమె అతన్ని వెళ్ళనివ్వలేదు. ఇహ పట్టుపట్టినట్టుగా వెళ్ళి బండీ తెస్తే అమర్యాదగా ఉంటుందని విశ్వనాథం చేసేదేమీలేక కూలబడ్డాడు కుర్చీలో. ఆ స్త్రీ హాండ్‌బ్యాగ్ టేబిల్‌మీద పెట్టి కాస్త ఫీలవుతున్నట్టుగా అంది: "మీ పని కడ్డొస్తున్నానేమో?"

"అబ్బె... లేదు..." అన్నాడు విశ్వనాథం మర్యాదకోసం. ఏదైనా బండీ త్వరగా వొస్తే బావుండునని అతను ఆరాటపడుతూ వీధి వైపు చూడసాగాడు. బండీ వొచ్చే అలికిడి ఏమీ లేదు. గడియారం త్వరత్వరగా నడుస్తోంది.

"మీరు కథలు రాస్తారు కాబోలు."

కథల ప్రసక్తి వొచ్చేటప్పటికి విశ్వనాథం కాస్త ఆసక్తితో ఆమెవైపు చూసి అన్నాడు- "అవును. మీకెలా తెలుసు?"

"బయట బోర్డుమీద జర్నలిస్టు అని ఉందిగా."

"ఓహో!"

"ఏ పత్రికల్లో రాస్తూంటారు?"

"ఒకటని లేదు. అన్నిట్లో..."

"క్షమించాలి... మీ పేరు ఏ పత్రికలో చూసినట్టు..." గొణిగినట్టుగా అందామె. విశ్వనాథం నవ్వి మధ్యలోనే అందుకుని అన్నాడు.

"మారుపేరుతో రాస్తూ ఉంటాను."

"ఆ పేరు నేను తెలుసుకోవొచ్చా?"

"క్షితిపతి." ఆ యువతి అకస్మాత్తుగా విద్యుద్ఘాతం తగిలినదానిలా "ఆఁ!" అని అంతలోనే సిగ్గుపడి ముఖం పక్కకి తిప్పుకుంది. ఆమె ఆశ్చర్యం చూసి విశ్వనాథానికి ఆసక్తి కలిగింది.

"క్షితిపతి మీరేనా?"

"అవును" గర్వంగా అన్నాడు విశ్వనాథం. "నా కథలు మీరేమైనా చదివారా?"

"ఎందుకు చదవలేదు? చాలా చదివాను."

"ఎలా ఉంటాయి మీకు?" కుతూహలంగా ఆమెముఖంలోకి చూస్తూ అడిగాడు విశ్వనాథం.

"నిజం చెప్పాలంటే మీరు రాసిన కొన్ని కథలు ప్రపంచంలో అన్ని భాషల్లోకీ అనువదించ తగ్గవని నా అభిప్రాయం."

విశ్వనాథానికి ఇటువంటి పొగడ్త ఎప్పుడూ, ఎవరి దగ్గరనుంచీ రాలేదు. అంతేకాక కనీసం తన కథలు బాగుంటాయనైనా ఒకరిద్దరు మొహమాటస్తులు తప్పితే ఎవరూ అనలేదు. అలాంటప్పుడు ఓ అపరిచిత వ్యక్తి, అందులో ఓ స్త్రీ- ఓ సుందరవదనారవింద- తన ఎదుట తనని ఆకాశానికెత్తటం చూసి విశ్వనాథం ఓ క్షణం తన్ను తాను మర్చిపోయాడు. ఆ స్త్రీ మీద అతనికి ఎంతో సదభిప్రాయం కలిగింది. ఆమె ఎవరో, ఏం చేస్తుందో తెలుసుకోవాలని అతనికి అభిలాష కలిగింది. పరాకుగా అతను టేబిల్ మీద ఉన్న ఆమె హ్యాండ్ బ్యాగ్ వైపు చూశాడు. దానిమీద పెయింట్ చేయబడ్డ అక్షరాలు అతన్ని ఆకర్షించాయి "మిస్ మాలతి" అన్నాయి విశ్వనాథం పెదవులు అప్రయత్నంగా. ఆ యువతి తలెత్తి అతనివైపు చూసి ఆశ్చర్యంతో "నా పేరెలా తెలిసింది మీకు?" అంది. విశ్వనాథం తన పొరపాటు గ్రహించి ప్రత్యుత్తరంగా హ్యాండ్ బ్యాగ్ వైపు తల ఎగరవేశాడు.

విశ్వనాథం తన కథల్ని గురించి ఆమెతో చర్చించాడు. ఆమె ఆప్యాయంగా వింటూ అతని కథల్ని ఎంతో మెచ్చుకోసాగింది. ఆమె మాట్లాడుతున్నంతసేపూ విశ్వనాథం తన్మయుడై వింటూ ఆమె తెలివిని మెచ్చుకోసాగాడు. తన కథల్ని గురించి చంపలకి ఎన్నో ఉత్తరాలు

రాశాడు. ఆమె ఒక్క ఉత్తరానికీ సమాధానం రాయలేదు. చంచల కెందుకంత గర్వం? తనంత తను ఆమె ప్రేమకోసం అర్థిస్తే ఎంత తిరస్కారము చూపింది! చంచల మీద విశ్వనాథానికి కొంచెం కోపం కలిగింది.

గడియారం అరగంట కొట్టింది. విశ్వనాథం ఉలిక్కిపడ్డాడు. టైమయి పోతోంది. బండీ ఏదీ వొచ్చేజాడ కనిపించటం లేదు. అతనికి ఏమీ తోచటంలేదు.

"మీరేదో ఆలోచిస్తున్నట్టున్నారు."

"ఆఁ... ఏం లేదు."

"ఎందుకో మీరు నీరసంగాఉన్నట్టున్నారు"

"మామూలుగానే ఉన్నాను."

"కాదు. కొంచెం హీనస్వరంతో మాట్లాడుతున్నారు. అస్వస్థతగా ఉన్నారల్లే ఉంది."

"ఆఁ... కొంచెం... ఇదిగా ఉందిలెండి, అంతకంటే ఏంలేదు."

"పొద్దున భోజనం చేసినట్టులేరు."

"ఊహుఁ... ఏం తినలేదు."

"పొద్దుటినుంచీ ఏమితినకుండా ఉన్నారా?" ఆమె అదుర్దాగా ఉన్నట్టు ప్రకటిత మయిందని తెలిసికొని కొంచెం సర్దుకొని బ్యాగ్ లోంచి ఓ ప్యాకట్ తీసింది. విశ్వనాథం మంత్రముగ్ధుడిలా ఆమెవైపు చూశాడు. మాలతి ఆప్యాకెట్ విప్పి కొన్ని బిస్కట్లు తీసి అతని కిచ్చింది. విశ్వనాథం సందిగ్ధావస్థలో పడ్డాడు. తప్పించుకోటానికి "ఇప్పుడు తినాలని లేదండీ, క్షమించాలి" అన్నాడు కాని ఆమె వదల్లేదు.

"మీరు తప్పక తినాలిసిందే. లేకపోతే నాకు నిజంగా కష్టంగా ఉంటుంది."

విశ్వనాథానికి ముచ్చటవేసింది. తనంటే ఆమెకి ఓవిధమైన ఇష్టత ఏర్పడ్డదని సులువుగా గ్రహించాడు. చంచలకీ ఈమెకీ ఎంత వ్యత్యాసం! తను నిరాహారదీక్ష వహిస్తున్నాడని ఉత్తరం రాస్తే చంచల ఎంత నిర్లక్ష్యంగా, ఎంత నిర్మోహమాటంగా జవాబిచ్చింది! తను పొద్దుటి నుంచీ ఏమీ తినలేదని తెలిసి మాలతి ఎంత అనుతాపం ప్రకటించింది! హృదయాల్లో ఉంటుందిగాని ముఖాల్లో ఏం తెలుస్తుంది? అమాట కొస్తే చంచలకంటే మాలతి అందంలో ఏమీ తీసిపోదు.

గడియారం గబగబముందుకు సాగిపోతోంది. నాలుగు గంటలు గడచిపోయినై. ఏవో బళ్లు అప్పుడప్పుడు వొచ్చి వెడుతున్నాయిగాని ఖాళీ బళ్లేమీ లేవు. చంచల ఏమనుకుంటూంటుందో! నిర్ణీతసమయానికి రాకపోతే ఆమెమీద తనకి ప్రేమ లేదని భావిస్తుందేమో? పోనీ మాలతిని ఇంట్లోనే ఉంచి తను వెడితే ... ఛీ... అదేం మర్యాద! విశ్వనాథం కాలుకాలిన పిల్లిలా గదిలో పచార్లు చేయసాగాడు.

మాలతి మళ్లీ అతన్ని బాతాఖానీలోకి దింపింది. మాటల సందర్భంలో ఆమెకి విశ్వనాథం పట్లగల ఆరాధన వ్యక్తమయింది. విశ్వనాథం తలవని తలంపుగా తనకి తటస్థమయిన ఆరాధకురాల్ని చూస్తూ ఏదో భావవీధిలో విహరించసాగాడు. టైం దాటిపోతోంది. గడియారం అయిదు గంటలు కొట్టింది. విశ్వనాథం ఏమి చెయ్యటానికీ తోచక తలపట్టుకుని కళ్లు మూసుకున్నాడు. చల్లని స్పర్శ తగిలి విశ్వనాథం కళ్లు విప్పాడు. మాలతి అతని హస్తాల్ని స్పృశించి అతని కళ్లల్లోకి చూస్తూ అంది: "ఇందాకటి నుంచీ చూస్తున్నాను. మీరేదో బాధపడుతున్నారు. నాకు చెప్పకూడదా ఆ బాధ ఏమిటో?" విశ్వనాథం ఆమె సాహసానికి ఆశ్చర్యపోయాడు. మాలతి ఎంత సున్నిత హృదయం కలది! తనమీద ఆమె కెంత అపేక్ష! అతను ఒక్క క్షణం ప్రపంచాన్నే మర్చిపోయి ఆమెకళ్ళలోకి చూశాడు. ఆమె కూడా నిశ్చలంగా అతని కళ్ళలోకి చూసింది. అతను ఆమె హస్తాలు తన చేతుల్లోకి తీసుకుని ప్రేమగా "మాలతీ!" అన్నాడు. ఆమె చిన్నగా నవ్వింది.

"మీరు విశ్రాంతి తీసుకోవాలి. మీకు స్వస్థత కలిగేదాకా నేనిక్కడే ఉండి మీకు పరిచర్య చెయ్యటానికి వెనుదీయను"

"నామీద నీకెందుకింత జాలి మాలతీ?" అన్నాడు విశ్వనాథం. మాలతి ప్రత్యుత్తరంగా చిరునవ్వు నవ్వింది.

"ఈ రోజు నా జీవితంలో మరువలేను. ప్రాణాధికమైన ఓ మణిని సంపాదించుకున్నాను ఇవాళ." విశ్వనాథం ఉద్రేకంగా అన్నాడు. మాలతి ఆకాశంలోకి చూసి చిరునవ్వు నవ్వింది. ఆమె మళ్ళీ యథాస్థానంలోకి వొచ్చి కూర్చుంది.

నిశ్శబ్దం ఓ నిమిషం ఆవరించింది ఆ గదిలో. ఇంతలో ఓ బండీ చప్పుడు వినిపించింది దూరంలో. మాలతి వీధిలోకి వెళ్ళి చూసి తిరిగి వచ్చి అంది. "ఏదో ఖాళీబండి వొస్తున్నట్టుంది. మీకిందాకటినించీ చాలా శ్రమ కలిగించాను. మళ్లీ కలుసుకునేదాకా సెలవు."

"వెడుతున్నావా మాలతీ?" అన్నాడు.

"మళ్ళీ వొస్తానుగా." అంది మాలతి నవ్వి. ఓ "కాగితంముక్క ఇవ్వండి. నా అడ్రెస్ రాసిస్తాను," అని అతని ప్రత్యుత్తరంతో నిమిత్తం లేకుండానే బల్లదగ్గిరికి వెళ్ళి బల్లమీద ఉన్న ఓ కాగితం తీసింది మాలతి. ఆ కాగితం మీద ఏదో రాసిఉన్నట్టు చూసి మాలతి అదేమిటో చూసింది. ఓ క్షణంలో ఆ కాగితంలోని అక్షరాలను చదివేసి కనుబొమలు ముడిచేసి అంది. "చంచల ఎవరు?"

"చంచలా? చంచలా? ఆమె... నా స్నేహితురాలు." అన్నాడు విశ్వనాథం ఆ కాగితం ఆమెకి కనబరచిన విధిని మనసులో దూషిస్తూ.

"అంటే?"

"అంటే స్నేహితురాలే." విశ్వనాథం నవ్వాడు. మాలతి మాట్లాడలేదు. విశ్వనాథం అదుర్దాగా ఆమెవైపు చూశాడు. కాసేపటి తర్వాత అంది. "అంతేనా? చాలా పరిచయమున్నట్లుందే మీ ఇద్దరికీ." విశ్వనాథం ఆమె అనుమానిస్తున్నదని గ్రహించాడు.

"మాలతీ! చదువుతున్న దానిని నువ్విలా అనుమానించటం బావుండలేదు. చంచలని నేనసలు సరిగా ఎరగను కూడా. ఏదో ముఖపరిచయం. అంతే!"

"ముఖపరిచయం తర్వాత..."

"చంచల మీద నాకు మరో అభిప్రాయం లేదు మాలతీ. నమ్మకం కలిగేట్టు ఎలా చెప్పగలనా అని చింతిస్తున్నాను. ఆమె నాకు సోదరి వంటిదని చెబితే నీవు నమ్మాలి."

మాలతి మందహాసం చేసింది. ఆ కాగితం మీద తన అడ్రసు రాసిచ్చి సెలవు తీసుకుంది, మళ్లీ మర్నాడు వస్తానని విశ్వనాథానికి మాటయిచ్చి.

మర్నాడు గడిచింది. మరో వారం రోజులు కూడా గడిచాయి, మాలతి జాడలేదు. ఆమె పేర ఉత్తరం రాశాడు. కాని జవాబు లేదు. మరో వారం గడిచింది. విశ్వనాథం రాసిన ఉత్తరం తిరిగి వొచ్చింది, పోష్టు వాళ్ల రిమార్కుతో. విశ్వనాథం తనకి మాలతి తప్పు అడ్రసు ఇచ్చిందని గ్రహించాడు. బహుశా ఆమె తనకీ, చంచలకీ ప్రణయ సంబంధం వుందని ఊహించి ఉంటుందనుకున్నాడతను. అతనికి మాలతి మీద జుగుప్స కలిగింది. ఆమెని నమ్ముకుని చంచలను కూడా అతను కలుకోలేదు. చంచలతప్పక తనని గర్హించి ఉంటుంది. చంచల అనుగ్రహం సంపాదించగల అవకాశాన్ని పోగొట్టుకొన్నానని విశ్వనాథం పరితపించాడు. ఎలాగైనా చంచలకి తనమీద కలిగిన దురభిప్రాయం తొలగించటానికి ప్రయత్నించాలనుకున్నాడు. అందుకు ఓ ఉపాయం ఆలోచించాడు. చంచల తనకి ఆఖరిసారి రాసిన ఉత్తరం తనకసలు అందనట్టుగా, ఆమెకి ఓ ఉత్తరం రాస్తూ ఇలా అన్నాడు.

'...మీ ఉత్తరం మళ్లీమళ్లీ చదువుకొని ఆఖరికి మీ ఇష్టంప్రకారం నిరాహార దీక్ష వహించకుండా ఉండడానికే నిశ్చయించుకున్నాను. ఆఖరిసారిగా మీకు ఉత్తరం రాస్తున్నాను. నా హృదయ బాధను మీరు సరిగా అర్థం చేసుకోవాలని నా కోరిక. మీరు సంతోషంగా ఉన్న సమయంలో ఒక్క క్షణం నాకోసం ఆగి మిమ్మల్ని ప్రేమించి మీకోసం సర్వం త్యాగం చేసి ఓ మారుమూల గదిలో శూన్యంలోకి చూస్తూ, మీ ప్రేమకోసం ఆరాటపడే ఓ వ్యక్తి నివసిస్తున్నాడని మీరు జ్ఞాపకం ఉంచుకోవాలని నా కడపటి కోరిక. క్షమించాలి.

మీ ప్రేమభిక్షువు
విశ్వనాథం.

తిరుగు టపాలో విశ్వనాథానికి ఉత్తరం వచ్చింది. దస్తూరీ చూచి విశ్వనాథం ఒక్క గంతు వేశాడు. అది చంచల రాసిన ఉత్తరమే. కవరు చించి చూసాడు. విశ్వనాథం ముఖం వివర్ణమైంది. ఆ ఉత్తరం తనురాసిందే. నిస్పృహగా విశ్వనాథం ఉత్తరాన్ని జారవిడిచాడు. కింద పడిన ఉత్తరం వెనకవైపున అక్షరాలు చూసి

విశ్వనాథం కౌతుకంతో దాన్ని తీసి చదివాడు.

'శ్రీ విశ్వనాథం గారికి

మిస్ మాలతిని అప్పుడే మర్చిపోయారా? నిరాహారదీక్ష బిస్కట్ల భక్షణతో అంతమయినందుకు ఆనందిస్తున్నాను. "చంచల బాకునోదరి వంటి"దని ఆనాడు అని, మళ్లీ గ్రంథం తిరగేయటం అసభ్యం. ఈ సారి మీ దస్తూరీగల కవరు వొస్తే దాన్ని చింపటం కూడా జరగదు. మరోమాట. మాలతి అడ్రసు తెలిసికోటం కోసం వ్యర్థ ప్రయత్నాలు చేస్తారేమో. మాలతి అవతారం చాలించింది. ఆశ వదులుకోండి.

చంచల."

ఆ ఉత్తరం చింపి, నలిపి, ఉండచేస్తూ "డామిట్" అన్నాడు విశ్వనాథం.

అభిప్రాయ వేదిక

# మద్యనిషేధం: మంచి చెడ్డలు

మేకా చక్రపాణి

మదరాసు రాష్ట్రంలో మద్యపాన నిషేధం వల్ల పదహారుకోట్ల రూపాయలవరకూ నష్టం వచ్చింది. దీనిని అసలులో పెట్టటానికి అదనంగా ఒకకోటి రూపాయలు తెప్పించవలసిన అవసరం యేర్పడింది. ఈ విషయంలో పండిత నెహ్రూగారు ఈ విధానాన్ని తొందరపడి అనుసరించవద్దని చెప్పారు. దేశం ఆర్థిక క్లిష్టస్థితిలో పడింది. అత్యవసరమైన ఆహారపదార్థాలను పరదేశాలనుండి తెప్పించుకోవలసిన అవసరం యేర్పడింది. దీనికిగాను అనేకకోట్ల రూపాయలు ఖర్చవుతున్నవి. ఈ సమస్య యెంద్ర సమస్యను పోలి వుంది. ఎప్పుడూ పరదేశాలనుండి ఆహార పదార్థాలు తెచ్చుకొంటే దేశం గుల్లకావలసిందే. అందుకుగాను, ప్రభుత్వం కొద్దిరోజులలో ఆహార ధాన్యాల దిగుమతులను ఆపివేస్తానని చెప్పింది. ఇది ముదావహం. ఆహార ధాన్యాల దిగుమతులాపివేస్తే, దేశంలో ప్రమాదం సంభవిస్తుంది. అందుకుగాను అదనంగా పంట పండించాలి. ఉపన్యాసాలవల్ల పంట పండదు. దానికి కావలసిన ప్రాజక్టుల నిర్మాణం, రైతులకు సహాయం చెయ్యాలి. అందుకు ఆర్థికస్తోమత ఉండాలి. ఆర్థికంగా బలపడి ఉంటేనే ఈ క్లిష్టస్థితి తొలగుతుంది. మదరాసు రాష్ట్రములో ప్రాజక్టులు కట్టమంటే, రైతులకు సహాయం చేయమంటే బొక్కసంలో డబ్బు శూన్యమంటున్నారు. గాంధీ అగ్రశిష్యులుగా పేరు పొందటానికి, ఆలోచన లేకుండా రాబడివచ్చే వాటిమీద నిషేధం పెట్టారు. ఆ నిషేధం తొలగించటానికి గౌరవప్రశ్న అడ్డు వస్తుంది. పనులు చేద్దామంటే డబ్బు హుళక్కి. బడ్జట్టు లోటులను రోజువారీగా సామాన్య మానవునిమీద పన్నులువేసి పూర్తి చేసుకొంటున్నారు.

మానవునికి అనేక అవసరాలు ఉన్నాయి. తిండి, బట్ట ప్రధానమైనవి. వీటిని ప్రప్రథమంగా తీర్చాలి. వ్యక్తిలో అంతర్యాభితంగా కోర్కెలున్నాయి. వాటిని వెల్లడించటానికి, అనుభవించటానికి ప్రతివ్యక్తి ప్రయత్నం చేస్తాడు. ఈ ప్రయత్నానికి యెవరైనా అడ్డువస్తే నిరోధించటానికి యత్నిస్తాడు వీలులేకపోతే తప్పుడు మార్గాన తన పనిని పూర్తి చేసుకొంటాడు. వ్యక్తి తన అవసరాన్నిబట్టి పని చేస్తూ ఉంటాడు. సారాయి అమితంగా త్రాగి రచ్చకెక్కి తందనాలాడితే తప్పకుండా శిక్షార్హుడే. ప్రజాశాంతిని భగ్నంచేసే ప్రతివాడూ శిక్షకు పాత్రుడే. గూండాలను, దోపిడీగాండ్రను యే విధంగా శిక్షించాలో వీరిని కూడా హద్దు మీరితే ఆ విధంగానే శిక్షించాలి. 'లా' దృష్టిలో అందరూ సమానులే. సమాజానికి యే విధంగానూ నష్టం చేయకుండా తన ఆనందానికి సారాయి సేవించేవాడు కూడా నేడు శిక్షార్హు డవుతున్నాడు.